క్లుప్తంగా

వృద్ధులకు కంటి ఆపరేషన్లు



వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న వృద్ధులు

పాలకొల్లు సెంట్రల్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు కంటి ఆపరేషన్లు చేయించారు. గురువారం క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకర రావు మాట్లాడుతూ పట్టణ, పరిసర ప్రాంతాల గ్రామాలకు చెందిన 15 మంది వృద్ధులకు స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో రూ.70వేల వ్యయంతో ఆపరేషన్లు చేయించామన్నారు. అనంతరం చికిత్స చేయించుకున్న అందరికీ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు షేక్ పీర్‌సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకర్‌రావు, సలాది రామచంద్రరావు, జవ్వాజి కళ్యాణ్, సోమంచి శ్రీనివాసశాస్త్రి, కర్రి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలను చెల్లించాలి



కరుగోరుమిల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న గోపాలన్

పెనుగొండ: ఉపాధి కూలీలు అర్ధాకలితో అలమటిస్తున్నారని కౌలు రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్ అన్నారు. ఆచంట మండలం కరుగోరుమిల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఇప్పటి వరకూ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీలో పనికి కొలతలు పెట్టి వేతనాన్ని చెల్లించడంతో ఉపాధి కూలీలు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. ఉపాధి హామీ పథక లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేయాలని చేస్తున్న కుట్రకు వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు ఉపాధి కూలీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు కత్తుల శ్రీను, కంకిపాటి వెంకటేశ్వరరావు, యాకోబు, వెంకట లక్ష్మీ, నాగలక్ష్మీ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాబాయ్ జయంతి



మాముడూరులో మాట్లాడుతున్న కపర్ధి

పెనుమంట్ర: మరాఠీలకు సుపరిపాలన, అందించిన ఘనత మాల్వ సామ్రాజ్యపురాణి అహల్యాబాయ్ హోల్కర్‌కే దక్కుతుందని బీజేపీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్ ఉన్నమట్ల కపర్ధి అన్నారు. గురువారం పెనుమంట్ర మండలం మాముడూరు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు మారుతీకృష్ణ అధ్యక్షతన అహల్యాబాయ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఐపీపీబీ ఖాతాలకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

భీమవరం: లబ్ధిదారులు సంక్షేమ పథకాల నగదు బదిలీకి బ్యాంక్ అకౌంట్–ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేయించుకోవాలని భీమవరం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ కె.హరికృష్ణ ప్రసాద్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇండియన్ పోస్టు పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) అకౌంట్ కలిగిన ఖాతాదారులు ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ మ్యాపింగ్ చేయడం ద్వారా లబ్ధిదారులు నేరుగా నగదు లబ్ధిని తమ ఖాతాల్లో పొందవచ్చని పేర్కొన్నారు. భీమవరం డివిజనలో 8989 మంది లబ్ధిదారులు ఎన్‌పీసీఐ లింక్ కాని వారు ఉన్నారని, డివిజన్ పరిధిలో 287 పోస్టాఫీసుల ద్వారా ఆధార్ లింక్ చేసుకోవాలని సూచించారు. ఐపీపీబీ ఖాతాల్లో జమయ్యే పథకాల సొమ్ము అయినా పోస్టాఫీస్, యూపీఐ, ఎన్‌ఈఎఫ్‌టీ, ఐఎంపీఎస్ ద్వారా తీసుకోవచ్చని స్పష్టం చేశారు.

స్కావెంజర్స్ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని స్కావెంజర్స్ కాలనీలను గుర్తించి అర్హులైన లబ్ధిదారులకు ప్రథమ ప్రాధాన్యతగా ఇళ్ల స్థలాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మ్యాన్యువల్ స్కావెంజర్ నిషేధ, పునరావాస చట్టానికి సంబంధించిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో మ్యాన్యువల్ స్కావెంజర్ కుటుంబ సభ్యులకు మెరుగైన అవకాశాలను కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. సెప్టిక్ ట్యాంక్ పైపులను డైరెక్ట్ గా డ్రైనేజీల్లో కలిపితే క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

గడపగడపనా నిలిచిన సంక్షేమం



రేషన్ వాహనం ద్వారా సరుకులు అందిస్తున్న దృశ్యం (ఫైల్)



అయోధ్యలంకలో వరద నీటిలోనూ ప్రభుత్వ సేవలు (ఫైల్)



పెనుగొండలో కరోనా సమయంలోనూ సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

ఏడాది కూటమి పాలనలో సీన్ రివర్స్

నరసాపురం: ఎన్నికల ముందు కూటమి నేతలు ఎన్నో వాగ్దానలు చేశారు. పాత పథకాలు ఏమి రద్దు చేయమని అంతకు మించి పథకాలు అందిస్తామని హామీలు గుప్పించారు. తీరా అధికారం చేపట్టిం ఏడాది కాలంలోనే వైఎస్సార్‌సీపీ అమలు చేసిన పథకాలకు మంగళం పాడటంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇళ్ల వద్దకే అన్నీ చందంగా వైఎస్సార్ సీపీ పాలన సాగింది. ముఖ్యంగా రేషన్ సరుకులు తెచ్చుకునే అంశంలో జనం విపరీతంగా కష్టపడేవారు. సుదూర ప్రాంతాలకు రేషన్‌షాపులకు వెళ్లడం, ఎంతోసేపు పడిగాపులు కాయడం కష్టంగా ఉండేది. ఈ కష్టాలకు చెక్ పెడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రేషన్ వాహనాలను ప్రవేశపెట్టింది. రేషన్ సరుకులు వాహనాలతో ఇంటికి పట్టుకొచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు రేషన్‌వాహనాలను రద్దు చేసి రేషన్ షాపుల వద్దకే వెళ్లి సరుకులు తెచ్చుకోవాలని కూటమి సర్కార్ నియమం పెట్టింది. నరసాపురం నియోజకవర్గంలో 28 రేషన్ వాహనాలు ఉండేవి. ఇప్పుడు ఈ సేవలు నిలిచిపోయాయి. అలాగే ప్రతి 50 కుటుంబాలకు ఓ వలంటీర్‌ను నియమించి ఆ 50 కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయించే విధంగా వలంటీర్ సాయంగా ఉండేవారు. వలంటీర్ వ్యవస్థకు మంగళం పాడటంతో జనానికి పాత కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ఎన్నికల్లో మభ్య పెట్టి ఏడాదిలోనే పాత కష్టాలు మళ్లీ చూపిస్తారా? అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరదల్లో ఆదుకున్న వలంటీర్లు

పెనుగొండ: కరోనా, వరదల లాంటి సమయంలోనూ ప్రభుత్వ పాలన స్తంభించకుండా గడప చెంతకే వలంటీర్లు వచ్చి సంక్షేమ పథకాలను అందించేవారని ప్రజలు నాటి వైఎస్సార్ సీపీ పాలనను గుర్తు చేసకుంటున్నారు. ఆచంట నియోజకవర్గంలో ప్రజల చెంతకే పాలన అందించడానికి ఆచంట మండలంలో 288 మంది, పెనుగొండ మండలంలో 280 మంది, పోడూ రుమండలంలో 262, పెనుమంట్ర మండలంలో 241 మంది వలంటీర్లుతో పాటు, 42 సచివాలయాల పరిధిలో 400లకు పైగా సిబ్బంది నిత్యం ప్రభుత్వ పాలను ప్రజల చెంతకే చేర్చి అండగా నిలిచేవారు. కూటమి ప్రభుత్వం వలంటీర్లుకు తిలోదకాలు ఇవ్వడంతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదిక్షణలు చేయాల్సి వస్తుందంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

నాడు గడప చెంతకే పాలన



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప చెంతకే పాలన అందించారు. అర్హత ఉంటే చాలు పథకం నేరుగా ఇంటి వద్దకే చేర్చడానికి సచివాలయ వ్యవస్థ పటిష్టంగా పని చేసేది. నేడు ఇంటి స్థలం, రేషన్ కార్డులకు దరఖాస్తులు చేయడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదిక్షణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

– దంపనబోయిన బాబూరావు, సోమరాజుచెరువు

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు సెంట్రల్: మండలంలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలెఱ చేసి బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం గురువారం మండలంలో అక్రమ మద్యంపై తనిఖీలు చేస్తుండగా వెదుళ్లపాలెం గ్రామంలో ఎస్.నారాయణ అనే వ్యక్తి వద్ద ఆరు మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. అతని నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతులకు మద్దతు ధర పెంచాలి



గోవిందరాజులు నాయుడు

పాలకొల్లు సెంట్రల్: ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు విత్తనం, ఎరువులు, పురుగుమందులు ధరల పెరుగుదలతో గిట్టుబాటు కాక అనేక కష్టాలను చవిచూస్తున్నారని పాలకొల్లు మండల జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజులు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ధాన్యం మద్దతు ధరపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరి రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలకు రూ. 69 పెంపుతో ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఈ పెంపుదల రైతులకు ఏమాత్రం ఉపశమనం కలిగించదన్నారు. పంట పెట్టుబడులకు అధికంగా ఖర్చులు అవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకుని క్వింటాలుకు మరో రూ. 50 అదనంగా బోనస్ మద్దతు ధరగా పెంచి రైతులను ఆదుకోవాలన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంపీపీకి నాయకుల అభినందనలు



ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

యలమంచిలి: ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన ఇనుకొండ ధనలక్ష్మీని న్యాయవాది, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయసరితతో పాటు ఇతర నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏనుగువానిలంక గ్రామంలో ఎంపీపీ స్వగృహంలో ఆమెను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మీ పరిపాలన దక్షతతో ప్రజలకు న్యాయం చేస్తూ, గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఎంపీపీని కలిసి శుభాకాంక్షలు చెప్పిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమా మహేశ్వరరావు, పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెచ్చెట్టి కృష్ణాజీ, జిల్లా యువజన యువజన ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి శెట్టి చిట్టిబాబు, వీరా మల్లిఖార్జున తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక స్థైర్యం పెరుగుదల



మార్టేరు వేసవి శిక్షణ కార్యక్రమంలో కుంగ్-ఫూ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెనుమంట్ర: క్రీడలు విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని న్యూమేక్స్ కుంగ్-ఫూ మాస్టర్ ఎం.ఫణికుమార్ అన్నారు. మార్టేరు శాఖ గ్రంథాలయంలో గురువారం 31వ రోజు వేసవి శిక్షణ శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు కుంగ్-ఫూలో శిక్షణ ఇచ్చి ఇలాంటి క్రీడలు పిల్లల్లో మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా ఇంగ్లిషు రిటైర్డు టీచర్ పి.సువర్ణగౌరీ, గ్రంథాలయాధికారి పీటీ శివకుమార్ పిల్లలతో ఇంగ్లిషు చదివించడంతో పాటు చెస్, క్యారమ్స్ వంటి క్రీడలను ఆడించారు. కార్యక్రమంలో ఎం.సత్యనారాయణ, టి.రాహుల్, డి.జశ్వంత్‌రెడ్డి, కె.కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముదునూరి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేయించి ముదునూరి ప్రసాదరాజుకు శుభాకాంక్షలు చెబుతున్న కౌన్సిలర్లు, పార్టీ నాయకులు

నరసాపురం: ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు జన్మదిన వేడుకను గురువారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ముదునూరి అభిమానులు ఘనంగా జరిపారు. పట్టణంలోని గోదావరిగట్టున పంటురేవు వద్ద ఉన్న ఆయన నివాసం వద్ద ముదునూరి పుట్టినరోజు వేడుకను నిర్వహించారు. ఉదయం నుంచి నియోజకవర్గంతో పాటుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, అభిమానులు వచ్చి ముదునూరికి శుభాకాంక్షలు చెప్పారు. దీంతో ఉదయం నుంచి ఆయన నివాసం వద్ద గోదావరిగట్టు ప్రాంతం జనంతో కిక్కిరిసింది. పూల బొకేలు, పూలమొక్కలు, కేక్‌లు పట్టుకొచ్చి ముదునూరికి శుభాకాంక్షలు చెప్పారు.ఈ సందర్భంగా భారీ కేక్‌ను ముదునూరితో పార్టీ నాయకులు కట్ చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కేంద్రపాలకమండలి సభ్యుడు పీడీ రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, నేతలు బర్రి శకరం, చాగంటి సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, పార్టీ పట్టన అధ్యక్షుడు కామన బుజ్జి, సీహెచ్ చినరెడ్డప్పధవేజీ, పార్టీ సీనియర్ నాయకులు వైకేఎస్, షేక్ బులిమస్తాన్, దొంగ మురళి, కర్రి ఏసుబాబు, చదలవాడ మెర్లిన్, మల్లాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లు అంటే గౌరవం లేదా?



పోడియం దిగివచ్చి వైఎస్సార్‌సీపీ సభ్యులతో కలసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ



కౌన్సిల్ సమావేశంలో వాగ్వివాదానికి దిగిన సభ్యులు

అధికారుల తీరు దారుణంగా ఉందని కౌన్సిలర్ల ఆగ్రహం

నరసాపురం: కౌన్సిలర్లు అంటే గౌరవం లేదు. అసలు కౌన్సిల్ అనేది ఒకటి ఉన్నట్టుగా కూడా అధికారులు వ్యవహరించడంలేదని పలువురు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ నిబంధనలు కూడా పాటించడంలేదని మండిపడ్డారు. నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ పర్యటనకు కారు ఏర్పాటు చేయడానికి ఏడాదికి రూ.35 వేలు చెల్లించేలా కాంట్రాక్ట్ అమల్లో ఉండగా, మళ్లీ మున్సిపాలిటీలో పని చేసే ఒకరితో కారు నడిపించుకుంటూ డ్రైవర్ జీతం కోసమని సొమ్ము చెల్లించాలని అజెండాలో పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాత ఇటీవల పట్టణంలోని ఐదో వార్డులో జరిగిన యోగా దినోత్సవ వేడుకపై తమకు కనీసం సమాచారం ఇవ్వలేదని కౌన్సిలర్లు వైస్ చైర్మన్ నాగినితో పాటుగా వన్నెంరెడ్డి శ్రీనివాస్, సఖినేటిపల్లి సురేష్, సఖినేటిపల్లి సురేష్, బొంతు రాజశేఖర్, కావలి రామసీత, సిర్రా కాంతమ్మ ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమంపై కూడా సభ్యులకు సమాచారం ఇవ్వకుండా వ్యవహరించడం ఏంటి? అని కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకే ఎలాంటి సమాచారం లేదని స్వయంగా చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ఆవేదన వ్యక్తం చేయడంతో సమావేశం అరుపులు కేకలతో దద్దరిల్లింది. అధికారులు వ్యవహార తీరు సభ్యులను అవమానించేలా ఉందని కో-ఆప్షన్ సభ్యుడు వైకేఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోడియం దిగిన చైర్‌పర్సన్

యోగా వేడుకపై సమాచారం ఇవ్వకపోవడంలో తప్పు ఎవరు చేశారో? చెప్పాలని వైఎస్సార్ సీపీ మహిళా సభ్యులు కామని నాగిని మిగిలిన మహి ళా సభ్యులు చైర్‌పర్సన్ పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. ఇదే సందర్భంలో 5వవార్డు సభ్యుడు వన్నెంరెడ్డి శ్రీనివాస్ కమిషనర్ వద్దకు వెళ్లి తన వార్డులో జరిగిన అధికార కార్యక్రమంపై తనకు సమాచారం ఇవ్వరా? అంటూ వాదనకు దిగారు. కనీసం ప్రొటోకాల్ పాటించకపోతే ఎలా? అని ప్రశ్నించారు. ఈలోపు ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలోకి జంప్ అయిన కౌన్సిలర్ కేసరి గంగరాజు ఒక్కసారిగా రూట్ మార్చి కమిషనర్‌కు అనుకూలంగా వైఎస్సార్‌సీపీ సభ్యులకు వ్యతిరేకంగా గళం విప్పడంతో గొడవ పెద్దదైంది. చైర్‌పర్సన్ కూడా పోడియం దిగి వచ్చి నిరసన తెలుపుతున్న సభ్యులతో కలిసి కమిషనర్ తీరును ప్రశ్నించారు. అసలు కౌన్సిల్ ఉందనుకుంటున్నారా? లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని మూడు పని దినాలకు ముందుగా అజెండా సభ్యులకు అందించాలని ఏదో 24 గంటలు ముందు అజెండా ఇచ్చి పెట్టే కౌన్సిల్ సమావేశం చెల్లదని వాదించారు. ఈ అంశంపై కూడా సభ్యుల వాగ్వివాదంతో సమావేశం రసాబాసగా మారింది.

విత్తన ఎంపిక ద్వారానే అధిక దిగుబడులు



పెనుమంట్ర: ఆలమూరులో మాట్లాడుతున్న ఉండి కృషి విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ పి.వినయ్‌లక్ష్మి



పెనుగొండ: ఆచంటలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

పెనుమంట్ర: రైతులు సరైన విత్తన ఎంపికద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఉండి కృషి విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ పి.వినయ్‌లక్ష్మి అన్నారు. గురువారం పెనుమంట్ర మండలం ఆలమూరు గ్రామంలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మినీ కిట్ వెరైటీ గురించి వివరిస్తూ ముంపును తట్టుకునే రకాలను రైతులు ఎంపిక చేసుకుని ఎరువుల, తెగుళ్ల యాజమాన్యం పద్ధతులను వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు రైతులు సేద్యం చేయాలన్నారు. మరో ముఖ్య అతిథి పెదవేగి ఆయిల్ ఫాం పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ ప్రసాద్‌మాట్లాడుతూ డెల్టాప్రాంతంలో మెరక పొలాల్లో ఆశక్తిగల రైతులు ఆయిల్‌ఫాంను సాగుచేసుకోవచ్చని సూచించారు. ఉండి కేవీకే మత్స్యశాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, మార్టేరు పరిశోధనా స్థానం ఏడీఏ కె రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయ అధికారి ఎ.జ్యోత్స్యల , పెనుమంట్ర డీసీ చైర్మన్ వెలగల బులిరామిరెడ్డి, నీటి సంఘం డైరెక్టర్‌లు తేతలి వెంకట రామారెడ్డి, ఓడూరు లక్ష్మీపతి, కలిదిండి వెంకట రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి పథకాలు

పెనుగొండ: రైతులకు అభ్యున్నతకి, వారికి సాగులో అండగాఉండడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయని జిల్లా వ్యవసాయాధికారి జె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఆచంట సొసైటీలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో పథకాలను వివరించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన, అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, వ్యవసాయ యాంత్రికరణ, ధాన్యం కొనుగోలు పథకాలను వివరించారు. కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్ర వేత్తలు డాక్టర్ ఎస్.మల్లికార్జున రావు, డాక్టర్ ఎస్పీ ప్రసాద్, డాక్టర్ వై.సుబ్బయ్య, డాక్టర్ పి.సహదేవరెడ్డి రైతులకు అనువైన వరి రకాలు మేలైన యాజమన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ అద్దాల పార్వతి, మత్స్య శాఖ ఏడీఏ ఆర్‌వీఎస్ వీ ప్రసాద ఉద్యాన వనశాఖాధికారి ప్రియదర్శిని, వ్యవసాయాధికారి బి.నాగరాజు, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి పాల్గొన్నారు.

పుంతరోడ్లకు మోక్షమెప్పుడు?



పెనుగొండ అడ్డపుంత రోడ్డు



సత్యవరం పుంతరహదారి



దొంగరావి పాలెం పుంత రహదారి

పెనుగొండ: రైతులు ఆరుగాలం కష్టపడి పండించుకున్న పంటలను మిల్లులకు చేర్చుకోవడానికి ఉపయోగపడే పుంత రోడ్లు నిర్మాణాలకు మోక్షమెప్పోడో? అంటూ రైతులు ఎదురు చూపులు చూస్తున్నారు. 2014కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ఆధ్వర్యంలో పుంత రోడ్లు నిర్మాణాలు చేశారు. అనంతరం పుంత రోడ్లు నిర్మాణాల వైపు కన్నెత్తి చూడలేదు. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల నిధుల కోత విధించడంతో పుంత రోడ్లు నిర్మాణాలకు ఆటంకం ఏర్పడింది. 2014 ప్రాంతంలో పెనుగొండ మండలంలో తామరాడ, వడలి, నడిపూడి, రామన్నపాలెం ల్లోనూ, పెనుమంట్ర మండలంలో రామేశ్వరం, జుత్తిగ, ఆలమూరు వంటి ప్రాంతాల్లో పుంత రోడ్లు నిర్మాణాలు దాదాపుగా రూ.60 లక్షలతో పూర్తి చేశారు. అనంతరం మరోసారి నిర్మాణాలు చేయడానికి రూ.80 లక్షలతో సైతం పలు పుంత రోడ్ల నిర్మాణాలు చేపట్టడానికి ప్రతిపాదనలు సైతం చేశారు. అయితే, నిధుల కొత విధించడంతో ప్రతిపాధనల స్థాయిలోనే అటకెక్కాయి. అప్పటి నుంచి పుంత రోడ్లుపై ఆశలు పెట్టుకొన్నారు.

ఏఎంసీల నియామకంతో ఆశలు

పెనుగొండ, ఆచంట ఏఎంసీలకు నూతన కమిటీల నియామకంకు గ్రీన్ సిగ్నల్ లభించడంతో మరోసారి పుంత రోడ్లు నిర్మాణాలపై రైతులు విజ్ఞప్తిలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా పెనుగొండ మండలం, పెనుమంట్ర మండలాల్లో పుంత రోడ్లు నిర్మాణాలు చేపట్టాలంటూ రైతులు విన్నవించుకుంటున్నారు. వడలి నుంచి దొంగరావిపాలెం వెళ్లే పుంత రహదారిలో వందలాది మంది రైతులు పంట ఉత్పత్తులను రోడ్డుపైకి తెచ్చుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారని, పుంత రోడ్డు నిర్మాణం చేపడితే కష్టాలు తప్పుతాయంటున్నారు. అదేవిధంగా పెనుగొండ అడ్డపుంత రహదారిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పుంత రహదారిలో రైతుల వరి పొలాలతో పాటు, కాలనీలు సైతం ఉండడంతో పుంత రహదారి నిర్మాణం చేపడితే ఉపయోగకరంగా ఉంటుందని కాలనీవాసులు, రైతులు విన్నవించుకొంటున్నారు. దీంతో పాటు సత్యవరం పుంత రహదారి నిర్మాణం చేపట్టాలంటూ రైతులు కోరుతున్నారు. రామన్నపాలెం, వడలి, ఇలపర్రు, నడిపూడి, దేవల్లోనూ పుంత రహదారులు అభివృద్ధి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.